

అడ్డగోలు అనుమతులు.. తవ్వకాలు

ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో గుండ్లకమ్మ ప్రాజెక్టుకు, చుట్టుపక్కల గ్రామాలు, పొలాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. గుండ్లకమ్మ డ్యాం వద్ద ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. - 8లో..



పోలీసుల ఆరోగ్యానికి ప్రాధాన్యత

పోలీసులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని ఎస్పీ దామోదర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 30/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గుక్కెడు నీళ్లివ్వండి సారూ..

- ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం ఎదుట మహిళల బైఠాయింపు



పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సుందరయ్య కాలనీ వాసులు

పెద్దదోర్నాల: వారం రోజుల నుంచి తమ కాలనీలో తాగునీరు సరఫరా చేసే ట్యాంకర్లు కూడా రావటం లేదంటూ మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీకి చెందిన మహిళలు శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. తమ కాలనీకి కొళాయిల ద్వారా కానీ, ట్యాంకర్ల ద్వారా కానీ నీరు అందటం లేదని, నీరిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వకుంటే ఇక్కడ నుంచి కదలమని ఖాళీ బిందెలతో అక్కడే భీష్మించుకున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి శివకోటేశ్వరరావు కాలనీకి నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామని మహిళలకు నచ్చజెప్పటంతో ఆందోళన విరమించారు. ఆందోళనలో కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మాండ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో ఆర్టీసీని కాపాడుకుందాం



ఎస్‌డబ్ల్యూ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభలో మాట్లాడుతున్న అయ్యపురెడ్డి

ఒంగోలు టౌన్: ఐక్య ఉద్యమాలతో ఆర్టీసీని కాపాడుకుందామని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యం.అయ్యపురెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా మహాసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. మహిళా కార్మికులకు డిపోలో సౌకర్యాలను కల్పించడంలో ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వన్ బై 19 సర్క్యులర్‌ను అమలు చేయాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.రమేష్, జీవి కొండారెడ్డి, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు ఎస్‌కె మీరావలి, పీరా వలి, బ్రహ్మయ్య, జీవి సుజాత, కాశీరత్నం, ఉప్పుటూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రివిజన్ వర్క్‌షాపు నిర్వహణ

ఒంగోలు సిటీ: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ఛాత్రోపాధ్యాయులకు రివ్యూ, రివిజన్ వర్క్‌షాపు సబ్జెక్టు నిష్ణాతులతో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వివిధ సబ్జెక్టులైన ఫిలాసఫీ, గణితం, ఆంగ్లం, సైకాలజీ తదితరాలకు సంబంధించిన కీలక అంశాలు, కాన్సెప్ట్ పై వర్క్‌షాపు నిర్వహించినట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు నిర్వహణలో సబ్జెక్టు నిపుణులుగా బిక్షాలురెడ్డి, ఎం.ఎస్.కె.శర్మ, పి.మెర్సిన్‌బాబు, వై.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు వ్యవహరించారు. అనంతరం సబ్జెక్టు నిపుణులంతా ప్రిన్సిపాల్ సామా సుబ్బారావును సన్మానించారు.

జీజీహెచ్‌లో ఈఎన్‌జీ వైద్య పరికరం



ఈఎన్‌జీ వైద్య పరికరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఏడుకొండలు

ఒంగోలు టౌన్: ఈఎన్‌టీ విభాగానికి సంబంధించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉండే ఎలక్ట్రానిస్టాగ్మోగ్రఫి(ఈఎన్‌జీ) వైద్య పరికరాలన్నీ జీజీహెచ్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు పేర్కొన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లో ఈఎన్‌జీ వైద్య పరికరాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఈఎన్‌జీ పరికరం ప్రస్తుతం విశాఖ పట్నం, విజయవాడ, తిరుపతి, కాకినాడలో మాత్రమే అందుబాటులో ఉందని చెప్పారు. సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమునకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ మాధవీలత, ఈఎన్‌టీ విభాగాధిపతి ప్రభాకర్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ నామినేని కిరణ్ పాల్గొన్నారు.

అక్షరానికి ఆలంబన

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ విద్యకు మహర్దశ

కూటమి పాలనలో అక్షరంపై అంకుశం

"మనం పిల్లలకు ఏదైనా ఆస్తి ఇస్తున్నామంటే అది మనమిచ్చే చదువు మాత్రమే.." అంటూ పేద, మధ్య తరగతి పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉండాలని ఇంగ్లిష్ మీడియం, ట్యాబ్‌లు, బైలింగ్విల్ బుక్స్, డిజిటల్ క్లాస్ రూంలు చేరువ చేశారు. నాడు–నేడుతో బడుల రూపురేఖలే మార్చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసింది. నేడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా విద్యావ్యవస్థలో ఆ జననేత ముద్రపై ప్రత్యేక కథనం.

- పేదల విద్యకు పెద్దపీట వేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- నాడు–నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- ఇంగ్లిష్ మీడియం, బైలింగ్విల్ బుక్స్, ట్యాబ్‌లు అందజేత
- ప్రైవేటుకు దీటుగా ప్రతిభ చాటిన సర్కారు బడి విద్యార్థులు
- కూటమి ప్రభుత్వం రాకతో గాడితప్పిన విద్యా వ్యవస్థ
- ప్రభుత్వ పాఠశాలల్లో ట్యాబ్‌లు, ఇంగ్లిష్ మీడియంకు మంగళం
- తల్లికి వందనం ఊసే ఎత్తని వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



ఒంగోలులో ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లతో 8వ తరగతి విద్యార్థులు (ఫైల్)

ఒంగోలు సిటీ:

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేసి అభివృద్ధి చేశారు. అంతేకాదు దేశంలోనే విద్యావ్యవస్థలో నంబర్ వన్‌గా రాష్ట్రాన్ని నిలిపారు. కల్లబొల్లి మాటలతో తప్పుడు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను సర్వనాశనం చేసింది. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల జీవితాలు బాగుపడనీయకుండా సీఎం చంద్రబాబునాయుడు అడ్డుపడుతున్నారు.

ప్రభుత్వ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీతో సంచలనం..

నేటి ఆధునిక సాంకేతిక ప్రపంచంలో ప్రభుత్వ విద్యార్థులు కూడా కార్పొరేట్‌కు దీటుగా ముందుకు సాగాలన్నది నాటి మాజీ సీఎం జగన్ లక్ష్యం. అందుకు అనుగుణంగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. బైజ్యూస్, టోఫెల్ కంటెంట్‌తో ట్యాబ్‌లను విద్యార్థులకు అందించారు. ఈ ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు మంచి విశ్లేషణలతో పాఠాలు అందుబాటులో ఉంటాయి. అంతేకాదు అందరికీ సులభంగా అర్థమయ్యేలా పాఠాలను అందులో చేర్చారు. తరగతి గదిలో పాఠం అర్థం కాకపోతే ఇంటికి వచ్చాక టాబ్‌లలో డిజిటల్ పాఠాల ద్వారా మరింత అవగాహన చేసుకోవడానికి వీలుంటుంది. కానీ కూటమి ప్రభుత్వం కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా ఎదుగుతున్న ప్రభుత్వ విద్యార్థులను చూసి ఓర్వలేక ఈ విద్యా సంవత్సరం ట్యాబ్‌ల పంపిణీ నిలిపేసింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విదేశాల్లో చదువులు: పాఠశాల విద్యాబోధన తర్వాత ఉన్నత విద్య కోసం పేద విద్యార్థులు చదువుకోవడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టిన దివంగతనేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్థాయిలో నిలిచిపోయారు. దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఇతర వర్గాల పిల్లలు ఫీజు రీయింబర్స్‌మెంట్ తో చదువుకొని విదేశాల్లో స్థిరపడ్డారు. ఆ కొనసాగింపునే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరెందరో విద్యార్థుల జీవితాలకు బంగారు బాట వేశారు. ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి వారి ఉన్నత చదువులకు ప్రోత్సాహం అందించారు. పిల్లలు కాలేజీకి వెళ్లాక ఎక్కడ ఉండాలో తెలియక ఇబ్బందులు పడుతుంటే వసతిదీవెన కింద అకౌంట్ లో డబ్బులు జమ చేసి విద్యార్థుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలు అమలు చేయకుండా చేతులెత్తేసింది.

ఇంగ్లిష్ మీడియంలో విప్లవాత్మక మార్పులు: ఇప్పుడున్న పోటీ ప్రపంచంతో ఇంగ్లిష్ నేర్చుకోవడం అత్యవసరం. అందు కోసం కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమైన ఇంగ్లిష్ మీడియంను ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రవేశపెట్టారు. ఇది కాకుండా మాతృభాషను ఎక్కడా చిన్నచూపు చూడకుండా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు మాతృభాషను తెలుగును ఒక సబ్జెక్టుగా చేర్చారు. ఇంగ్లిష్ మీడియం వల్ల తెలుగు భాష నష్టపోతుందని గోల పెట్టి కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ను ఒక ఆప్షన్ లాగా చేర్చి ఇంగ్లిష్ మీడియంని పేద విద్యార్థులకు దూరం చేసింది. పరీక్షలను తెలుగులో కూడా రాయవచ్చని జీవో జారీ చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న విదేశీ విద్యాదీవెనతో విదేశాల్లో ఉన్నత చదువులు:

మన విద్యార్థులు ప్రపంచ దేశాల్లో ఉన్న యూనివర్సిటీ విద్యార్థులతో పోటీపడతారనే ముందుచూపుతో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని ప్రవేశపెట్టారు. అర్హత ఉన్న ప్రతి విద్యార్థిని ప్రోత్సహించి కొన్ని వేల మందిని విదేశాల్లో ఉన్నత చదువులకు పంపించారు. నేడు కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని పేరు మార్చి అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యగా మసిపూసి మారేడు కాయ చేసి వదిలేసింది. ఈ ఆరు నెలల్లో ఏ ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది.

వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లాలో 'విద్యాదీవెన' కింద ఇచ్చిన మొత్తం:

సంవత్సరం	విద్యాదీవెన		విడుదలైన మొత్తం
	విద్యార్థులు	తల్లులు	
2019-20	84,680	-	2,12,34,99,271
2020-21	80,201	71,737	1,59.53,09,193
2021-22	55,646	49,635	1,44,25,41,681
2022-23	41,868	38,280	1,38,50,59,495
2023-24	47,422	42,797	36,44,29,751
మొత్తం	3,09,817	2,02,449	6,91,08,39,391

వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లాలో 'వసతి దీవెన' కింద ఇచ్చిన మొత్తం

సంవత్సరం	వసతి దీవెన		విడుదలైన మొత్తం
	విద్యార్థులు	తల్లులు	
2019-20	88,949	-	87,46,72,500
2020-21	80,914	71,284	78,07,45,500
2021-22	53,953	48,430	52,04,70,000
2022-23	48,499	43,878	46,72,17,500
మొత్తం	2,72,315	1,63,592	2,64,31,05,500

కూటమి ప్రభుత్వం లో విద్యాదీవెన ద్వారా 1,237,637 మంది విద్యార్థులకు వారి తల్లులు 1,14,532 మంది అకౌంట్లలో రూ.89,44,38,683, వసతి దీవెనకు 2,80,364 మంది విద్యార్థుల తల్లులు 2.51,348 మందికి రూ.2,70,28,67,500 చెల్లించాల్సి ఉంది.

'అమ్మ ఒడి' వివరాలు ఇలా...

సంవత్సరం	విద్యార్థుల తల్లులు సంఖ్య	విడుదలైన మొత్తం (రూ.కోట్లలో)
2019-20	2,16,028	324,04,20,000
2020-21	1,97,329	295,99,35,000
2021-22	2,09,776	314,66,40,000
2022-23	2,82,088	423,13,20,000

మొత్తం 8వ తరగతి విద్యార్థుల సంఖ్య: **21,617**

ట్యాబులు పంపిణీ చేసిన విద్యార్థుల సంఖ్య: **20,436**

నాడు-నేడు పనులు ఇలా..

ఫేజ్-1

మొత్తం పాఠశాలలు: **1015**

విడుదల చేసిన నిధులు: రూ.**229.61** కోట్లు

పూర్తి చేసిన పాఠశాలల సంఖ్య: **1015**

ఫేజ్-2

మొత్తం పాఠశాలలు: **979**

కేటాయించిన నిధులు: రూ.**417.31** కోట్లు



నాడు-నేడు కింద రూపు మారిన మురారిపల్లి మోడల్ స్కూల్

అమ్మ ఒడితో తల్లుల కళ్లల్లో ఆనందం..



అమ్మ ఒడి డబ్బులు పడిన మెసేజ్ చూపుతున్న తల్లి (ఫైల్)

ప్రభుత్వ బడులకు వచ్చే విద్యార్థులు దాదాపుగా పేద మధ్య తరగతి కుటుంబాల పిల్లలే. పేదరికంతో పిల్లల్ని బడికి పంపలేక తమతో పాటు పనులకు తీసుకెళ్లేవారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడితో నేరుగా తల్లుల అకౌంట్లోనే రూ.15 వేలు జమ చేసి వారి కుటుంబానికి ఆర్థిక భారం పడకుండా చేశారు. ఈ డబ్బులతో తల్లులు తమ పిల్లలను బడికి పంపి.. విద్యకు సంబంధించిన వస్తువులు ఇచ్చి వారి పిల్లలను ప్రోత్సహించారు.

నాడు-నేడుతో పాఠశాలల్లో విప్లవం..

శిథిలమైన గోడలు, కారుతున్న పైకప్పులు.. ఊడుతున్న పెచ్చులు, బల్లలు లేక విద్యార్థులు కింద కూర్చుంటున్న పాఠశాలలను నాడు-నేడు అనే బృహత్తర కార్యక్రమంతో వైఎస్ జగన్ వాటి రూపురేఖలు మార్చేశారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లకు ఏమాత్రం తీసిపోకుండా నిర్మించారు. తొమ్మిది రకాల అంశాలతో పాఠశాలలను అందంగా తీర్చిదిద్దారు. పాఠశాలల పునర్నిర్మాణం, గ్రీన్‌బోర్డ్, ఆన్‌లైన్ క్లాసులు, డిజిటల్ తరగతులు, బెంచీలు, ఎల్ఈడీ టీవీలు, ఫ్యాన్లు, పాఠశాల ఆవరణలో పచ్చటి వాతావరణం ఇలా అనేక వసతులు సమకూర్చి విద్యావ్యవస్థను గాడిలో పెట్టారు.

కూటమి ప్రభుత్వంలో గాడితప్పిన విద్యా వ్యవస్థ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థను గాలికొదిలేసి నడ్డి విరిచేసింది. గత ప్రభుత్వంలో నాడు-నేడు ఫేజ్ 1 కింద రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన అన్ని పాఠశాలలో నిర్మాణాలు పూర్తి చేశారు. నాడు-నేడు ఫేజ్2 కింద ఎంపిక చేసిన వాటిలో 95 శాతం పాఠశాలలు పూర్తిచేశారు. కేవలం చివరి దశలో ఉన్న పాఠశాల నిర్మాణాలను పూర్తి చేయలేక ఈ ఆరు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది.



నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన ఒంగోలు బండ్లమిట్ట ప్రాథమిక పాఠశాల

'తల్లికి వందనం'పై మాయమాటలు



గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి డబ్బులు తల్లి ఖాతాల్లో క్రమం తప్పకుండా పడుతుండటంతో పిల్లలు పాఠశాలకు చేరే సమయంలో వారి అవసరాలకు ఎంతగానో ఉపయోగపడేవి. ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా కూటమి నాయకులందరూ ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం'పేరుతో ఖాతాల్లో డబ్బులేస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత చేతులెత్తేశారు. దీంతో ఎంతోమంది పేద తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

– అవ్వారి గురుమూర్తి, కంభం

గతంలో నాడు–నాడుతో రూపు మారిన పాఠశాలలు



గత ప్రభుత్వంలో నాడు–నేడు ద్వారా చేసిన పనులతో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ఉన్నాయి. తరగతి గదుల్లో బెంచీలు ఏర్పాటు చేశారు. దీనివల్ల మా పిల్లలు బెంచీల్లో కూర్చుని పాఠాలు వింటున్నారు. నాడు–నేడు పాఠశాల రూపురేఖలను మార్చివేసింది. పిల్లలకు డిజిటల్ క్లాసుల ద్వారా పాఠాలు వినిపిస్తున్నారు. పేద పిల్లలకు సాంకేతికతను నాడు–నేడు దగ్గరికి తీసుకొచ్చింది.

– వై.వసంత్, కొండపి

విద్యార్థుల మెనూలో విప్లవాత్మక మార్పులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. ఉదయం పూట రాగి జావ, చిక్కీలు ఇచ్చారు. బియ్యంలో కూడా నాణ్యత పెరిగింది. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించారు.

– అల్లడి నారాయణ్, కొండపి

ఇంత వరకూ ట్యాబ్ ఇవ్వలేదు



నేను ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. గతేడాది స్కూల్స్ తెరిచిన వెంటనే మా సీనియర్స్‌కు చదువుకునేందుకు ట్యాబ్‌లు ఇచ్చారు. అయితే ఈ సంవత్సరం స్కూల్స్ తెరచి 6 నెలలు దాటినా ట్యాబ్‌లు ఇవ్వలేదు. ట్యాబ్‌ల కోసం మా ఫ్రెండ్సందరమూ ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం త్వరగా ట్యాబ్‌లు ఇవ్వాలని కోరుతున్నాం.

– ఎస్ మల్లిఖార్జునరెడ్డి, 8 వ తరగతి విద్యార్థి, మార్కాపురం

వైఎస్ జగన్ జన్మదినాన సేవా కార్యక్రమాలు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు

ఒంగోలు సిటీ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపడతామని వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కఠారి శంకరరావు మాట్లాడుతూ ఈనెల 21న వైఎస్ జగన్ జన్మదిన వేడుకల సందర్భంగా ఒంగోలు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు ముఖ్య అతిథిలుగా పాల్గొంటున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమం, 9.45 గంటలకు వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు నంద కిషోర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బ్లడ్ డొనేషన్, 10 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పేద మహిళలకు చీరల పంపిణీ నిర్వహించనున్నట్లు తెలిపారు. 11.15 గంటలకు వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో మాతాశిశు వైద్యశాలలో ఫ్రూట్స్, బ్రెడ్ పంపిణీ, 11.30 గంటలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు ముళ్లంగి రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వర కాలనీలోని బధిరుల పాఠశాలలో మిక్సీ, ఫ్రూట్స్ పంపిణీ, 11.45 గంటలకు 45 వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వరరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పల్నాటి రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు రోడ్డులోని సున్నపు బట్టీల వీధిలో సూర్య చారిటబుల్ ట్రస్ట్ వారి బ్లైండ్ స్కూల్‌లో అన్నదాన కార్యక్రమం, మధ్యాహ్నం 12 గంటలకు 44 వ డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో ఉమా మనోవికాస కేంద్రంలో అన్నదాన కార్యక్రమం, 2.30 గంటలకు చింతాయగారిపాలెంలో నాయకులు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు కోఆప్షన్ సభ్యుడు రషీదా నాగూర్, 33వ డివిజన్ అధ్యక్షుడు పందింటి కాశీరావు ఆధ్వర్యంలో ముంగమూరు రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కటింగ్, 6 గంటలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు స్టీఫెన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో కేక్ కటింగ్, 6.30 గంటలకు కొత్తపట్నం మండలంలో పేద మహిళలకు చీరల పంపిణీ చేస్తారు.

8 గంటలకు వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. జగన్ జన్మదిన వేడుకలను వాడవాడలా చేయడానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రొండా అంజిరెడ్డి, జి.వెంకటేశ్వర్లు, భూమిరెడ్డి రమణమ్మ, పిగిలి శ్రీనివాసరావు, సాధం విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సక్రమంగా నిర్వహించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయించడంలో రైతుకు ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. వ్యవసాయ, సివిల్ సప్లయిస్ అధికారులతో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి ధాన్యం సేకరణ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యాన్ని విక్రయించే క్రమంలో అధికారుల నుంచి ఇబ్బందులు పడినట్లు, వర్షాలతో పంట ఉత్పత్తులు కాపాడుకునేందుకు టార్పాలిన్ పట్టలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించినట్లు రైతుల నుంచి ఫిర్యాదు వస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకుని అధికారులు మరింత చురుగ్గా వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సాగు విస్తీర్ణం ఎంత, ఇప్పటి వరకు ఎంత మోతాదులో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చారు, ఇంకెంత రావాల్సి ఉందనే అంశాలపై అధికారులకూ పూర్తి అవగాహన ఉండాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టులను జనవరి 15వ తేదీ నాటికి భర్తీ చేయాలని ఆదేశించారు. రేషన్ బియ్యానికి సంబంధించి అక్రమాలపై నమోదు చేస్తున్న కేసులపై ఆరా తీశారు. రేషన్ బియ్యం అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ బియ్యంలో అక్రమాలకు పాల్పడే వారికి భయం ఏర్పడేలా రైస్ మిల్లులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉదాసీనంగా వ్యవహరిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ డీఎం వరలక్ష్మి, డీఎస్ఓ పద్మశ్రీ, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ ఉపేంద్ర, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం సేకరణ ప్రక్రియపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

అడ్డగోలు అనుమతులు తవ్వకాలు



అక్రమంగా గ్రావెల్ తవ్వకాలతో కనుమరుగైపోతున్న పెయ్యాలతిప్పకొండ

- గుండ్లకమ్మ డ్యాం వద్ద ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు
- విజయవాడ – బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి భారీగా తరలింపు
- ఇరిగేషన్ ఎస్ఈ అనుమతులు ఉన్నాయంటున్న నిర్వాహకులు
- ఎఫ్ఆర్ఎల్ లోపలే అనుమతులిచ్చినట్లు చెబుతున్న ఇరిగేషన్ అధికారులు
- ఎఫ్ఆర్ఎల్ వెలుపల కూడా తవ్వడంతో గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు ముప్పు
- ఒకరిపై మరొకరు చెప్పుకుంటున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు



దొడ్డవరం నుంచి పాతగార్లపాడు వెళ్లే డొంక రోడ్డును గ్రావెల్ రోడ్డుగా మార్చిన దృశ్యం

మద్దిపాడు: ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాకే తలమానికమైన గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు, చుట్టుపక్కల గ్రామాలు, పొలాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్ వద్ద గ్రావెల్ తవ్వకాలకు ఓ రోడ్డు నిర్మాణ సంస్థకు అడ్డదిడ్డంగా అధికారులు అనుమతులివ్వడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఇచ్చిన అనుమతులకు మించి.. ఏకంగా గుండ్లకమ్మ ప్రాజెక్టుకే ప్రమాదం వాటిల్లేలా ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. అక్రమ తవ్వకాలపై చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అడ్డుకునేంత వరకూ అధికారులు మొద్దునిద్రలో ఉండటంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. చివరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఒకరిపై మరొకరు చెప్పుకోవడంపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. మామూళ్ల మత్తు కారణంగానే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని రిజర్వాయర్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు.

2 జేసీబీలు, 50కిపైగా టిప్పర్లతో వేల టన్నుల గ్రావెల్ తరలింపు...

విజయవాడ నుంచి బెంగళూరుకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను ఏజీఎస్ కన్‌స్ట్రక్షన్ సంస్థ చేస్తోంది. ఈ రోడ్డు నిర్మాణానికి భారీగా మట్టి, గ్రావెల్ అవసరం కాగా, గుండ్లకమ్మ డ్యాంలోని ఫుల్ రిజర్వింగ్ లెవల్ (ఎఫ్ఆర్ఎల్) లోపలివైపు మట్టి తవ్వి తరలించుకునేందుకు ఇరిగేషన్ ఎస్ఈ అనుమతులిచ్చినట్లు తెలుస్తుంది రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు దోహదపడుతుందనే ఉద్దేశంతో అనుమతులిచ్చినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. కానీ, మద్దిపాడు మండల పరిధిలోని పాత గార్లపాడు, దొడ్డవరం రెవెన్యూ పరిధిలో ఉన్న పెయ్యాలతిప్ప కొండను తవ్వి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నారు. రెండు పెద్ద జేసీబీలతో తవ్వకాలు జరిపి 50కిపైగా టిప్పర్ల ద్వారా వేల టన్నుల గ్రావెల్‌ను మాయం చేస్తున్నారు. జలాశయ నిర్మాణ సమయంలో ఇరిగేషన్ అధికారులు పెయ్యాలతిప్పపై ఎఫ్ఆర్ఎల్‌కు కొన్ని మీటర్ల దూరం వరకు హద్దురాళ్లు ఏర్పాటు చేసి తవ్వకాలు నిషేధించారు. కానీ, ఏజీఎస్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారు ఎఫ్ఆర్ఎల్ రాళ్లను సైతం పెకిలించి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు.

కరకట్టకు బలం తగ్గి గ్రామాలు మునిగే ప్రమాదం...

గుండ్లకమ్మ జలాశయం కుడి కరకట్టకు దన్నుగా నిలిచిన పెయ్యాలతిప్ప కొండను ఆనుకుని జలాశయం లోపల వైపున్న గ్రావెల్ తవ్వుకోవడానికి ఇరిగేషన్ ఎస్ఈ అనుమతివ్వడంతో ఏజీఎస్ కన్‌స్ట్రక్షన్స్ వారు గ్రావెల్ తవ్వకాలు మొదలుపెట్టారు. కానీ, పెయ్యాలతిప్ప కొండను బయటవైపు (ఎఫ్ఆర్ఎల్ వెలుపల) కూడా తవ్వి గ్రావెల్ తరలిస్తుండటంతో జలాశయానికి కుడివైపు ఉన్న కరకట్టకు బలం తగ్గి జలాశయంలోని నీరు బయటకు వెళ్లే ప్రమాదం ఉంది. అదే జరిగితే చుట్టుపక్కల గ్రామాలు మునిగిపోయే అవకాశం ఉంది. గతంలోనే పెయ్యాల తిప్ప నుంచి చుట్టుపక్కల గ్రామాల వారు గ్రావెల్ తరలించుకుపోయారు. గుండ్లకమ్మ జలాశయం నిర్మాణం తర్వాత ఆ ప్రాంతంలో గ్రావెల్, మట్టి తరలించడాన్ని నిషేధించారు. దీంతో చుట్టుపక్కల గ్రామస్తులు సైతం వారి అవసరాలకు గ్రావెల్, మట్టిని ఇతర ప్రాంతాల నుంచి సరఫరా చేసుకుంటున్నారు. ప్రస్తుతం నిషేధిత ప్రాంతంలోనే గ్రావెల్ తవ్వి తరలిస్తుండటంపై సమీప గ్రామాల ప్రజలంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తవ్వకాలను అడ్డుకున్న దొడ్డవరం గ్రామస్తులు...

ప్రమాదకరస్థాయిలో గ్రావెల్ తవ్వి తరలిస్తుండటంతో దొడ్డవరం గ్రామస్తులు గత బుధవారం టిప్పర్లను అడ్డుకున్నారు. హద్దులు నిర్ణయించకుండా జలాశయం అధికారులు గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఎలా ఇస్తారంటూ వారు ప్రశ్నిస్తున్నారు. దీనిపై స్థానిక తహసీల్దార్ కూడా వెళ్లి తవ్వకాలను పరిశీలించి నిలిపివేసి ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తానని తెలిపారు. అయితే, అక్రమంగా తవ్వకాలు చేస్తున్న ప్రాంతం ఇరిగేషన్‌తో పాటు రెవెన్యూ పరిధిలో కూడా ఉన్నప్పటికీ.. గ్రామస్తులు ఆందోళన చేసేంత వరకూ సంబంధిత అధికారులకు తెలియకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని గుండ్లకమ్మ జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకే గ్రావెల్ తవ్వకాలకు అనుమతులిచ్చినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నప్పటికీ.. రెవెన్యూ పరిధిలో కూడా అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ.. ఈ గ్రావెల్ తవ్వకాల వలన జలాశయం కుడి కరకట్ట బలహీనమై గండి పడే ప్రమాదం ఉందంటూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. రైతుల పంట భూములకు కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ వారు ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ రిజర్వాయర్‌ను నిలువునా ముంచేలా ఉన్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు వెంటనే స్పందించి గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను కాపాడాలని, చుట్టుపక్కల గ్రామాలకు, పొలాలకు రక్షణ కల్పించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



టిప్పర్లతో గ్రావెల్ తరలించేందుకు ఎన్ఎస్పీ కెనాల్‌ను కొంతమేర పూడ్చివేసి నిర్మించిన రోడ్డు

గ్రావెల్ తరలించేందుకు ఎన్ఎస్పీ కెనాల్ పూడ్చి మరీ రోడ్డు నిర్మాణం...

గుండ్లకమ్మ డ్యాం వద్ద అక్రమంగా తవ్విన గ్రావెల్‌ను టిప్పర్ల ద్వారా తరలించేందుకు ఎన్ఎస్పీ కెనాల్‌ను కొంతమేర పూడ్చి మరీ గ్రావెల్ రోడ్డును ఏజీఎస్ కన్‌స్ట్రక్షన్ సంస్థ నిర్మించింది. దీని గురించి కూడా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అద్దంకి మండలంలోని ధేనువకొండ ఆర్అండ్‌బీ రోడ్డు మీదుగా వెళ్తూ మధ్యలో ఉన్న ఎన్ఎస్పీ కెనాల్ గట్టుపై గ్రావెల్‌తో సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేర 15 అడుగుల వెడల్పుతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డును దొడ్డవరం నుంచి పాత గార్లపాడు వెళ్లే డొంక రోడ్డుకు లింకు చేసుకుని మార్గం మధ్యలో ఉన్న చెరువు కట్టపై 45 అడుగుల వెడల్పు కలిగిన గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. ఎన్ఎస్పీ కాలువ గట్టు ఆక్రమించి రోడ్డు నిర్మించినా.. చెరువు కట్టపై 45 అడుగుల వెడల్పుతో గ్రావెల్ రోడ్డు నిర్మించినా.. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో వేసిన చెట్లకు ఇబ్బంది కలుగుతున్నా.. సంబంధిత అధికారులెవరూ పట్టించుకోకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



మృతిచెందిన పాపారావు

మద్దిపాడు: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో మద్దిపాడు మండలంలోని దొడ్డవరం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మోరబోయిన పాపారావు (30) వృత్తిరీత్యా కరెంటు పనులు చేస్తుంటాడు. శుక్రవారం తన పొలంలోకి నీరు పెట్టేందుకు చెరువు గట్టునున్న మోటార్‌ను రిపేర్ చేస్తుండగా షాక్ కొట్టి చెరువులో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకుని పాపారావు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

స్థల వివాదం కేసులో నిందితులకు శిక్ష

నాగులుప్పలపాడు: మండలంలోని మాచవరం గ్రామంలో ఓ స్థల వివాదం కేసులో నిందితులకు శిక్షపడినట్లు స్థానిక ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపారు. ఆ వివరాల మేరకు.. మాచవరం గ్రామానికి చెందిన మద్రావుల సుబ్బారావు అతని భార్యతో కలిసి 2018లో వారి స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి గుంతలు తీస్తుండగా, అదే గ్రామానికి చెందిన మద్రావుల శ్రీనివాసరావు, అతని భార్య పార్వతి, కుమార్తె లక్ష్మి అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. గుంతలు తీయవద్దని గొడవకు దిగి సబ్బారావు, అతని భార్యపై దాడి చేయగా వారికి తీవ్రగాయాలై ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రస్తుతం విచారణ పూర్తవగా, ఒంగోలు జేఎఫ్‌సీఎం ఎక్సైజ్ కోర్టు జడ్జి కోమలివల్లి ఏ–1కు రెండేళ్ల జైలు, రూ.7 వేల జరిమానా, ఏ–2కు రూ.2 వేలు, ఏ–3కి రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్ఐ వివరించారు.

ఆక్రమించింది బస్‌షెల్టర్ స్థలమే..



కొలతలు వేస్తున్న సర్వేయర్, ఆర్టీసీ అధికారులు

బేస్తవారిపేట: మండల కేంద్రమైన బేస్తవారిపేటలో సర్వే నంబర్ 283/1లో బస్‌షెల్టర్ నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు 20 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ఓ టీడీపీ నాయకుడు ప్రయత్నించినట్లు అధికారులు నిర్ధారించారు. శుక్రవారం ఒంగోలు ఆర్టీసీ ఏఈ టి.వెంకటేశ్వర్లు సమక్షంలో సర్వేయర్ సురేష్, వీఆర్వో ఇండ్లా శేఖర్‌రెడ్డి బస్ షెల్టర్ స్థలాన్ని కొలతలు వేశారు. ఆ 20 సెంట్ల స్థలంలోనే కొంతమేర ఆక్రమించేందుకు చిల్లకంప తొలగించడంతో పాటు మెరక తోలారని గుర్తించారు. ఈ నేపథ్యంలో స్థలానికి హద్దులు గుర్తించిన ఆర్టీసీ అధికారులు చుట్టూ కంచె ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం చంద్రశేఖర్, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామానాయక్ పాల్గొన్నారు. కాగా రూ.లక్షల విలువైన స్థలాన్ని కబ్జాకోరుల పాలుకాకుండా ఆర్టీసీ అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నర్సింగ్ వృత్తి పవిత్రమైనది

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలు



మాట్లాడుతున్న డాక్టర్ ఏడుకొండలు

ఒంగోలు టౌన్: నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని, అత్యంత నిబద్ధత, సహానుభూతితో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మెరిట్ విద్యార్థులకు మాత్రమే ఇక్కడ సీటు లభిస్తుందని, వృత్తిలో రాణించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రాక్టికల్స్ సమయంలో డాక్టర్లు, సిబ్బంది సహకారంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున సూచించారు. సేవలందించే సమయంలో స్నేహపూర్వకంగా ఉంటే రోగులు త్వరగా ఉపశమనం పొందుతారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు యాప్రాన్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, ఆర్ఎంఓ మాధవీలత, డిప్యూటీ సూపరింటెండెంట్లు నామినేని కిరణ్, డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

నాన్న పోయారు.. ఇంటికి రా కన్నా..!

- రెండున్నరేళ్ల కిందట తప్పిపోయిన కుమారుడు
- కుమారుడిపై దిగులు పెట్టుకుని గుండెపోటుతో తండ్రి మృతి
- మృతదేహాన్ని అలాగే ఉంచి కుమారుడి కోసం కుటుంబ సభ్యుల ఎదురు చూపులు



గుండెపోటుతో మరణించిన చాకిచర్ల గోవిందరావు



తప్పిపోయిన శరత్ (ఫైల్)

ఒంగోలు టౌన్: తప్పిపోయిన కుమారుడి కోసం రెండున్నరేళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసిన తండ్రి గుండెపగిలింది. చివరి శ్వాస దాకా కుమారుడి ఆచూకీ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయిన ఆ పెద్దాయన గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. తండ్రి ఆఖరి చూపుకైనా కుమారుడు వస్తాడని అంత్యక్రియలు నిర్వహించకుండా మృతదేహాన్ని అలాగే ఉంచి ఆ కుటుంబం ఎదురుచూస్తోంది. ఒంగోలు పట్టణానికి చెందిన చాకిచర్ల గోవిందరావు(56) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ పౌరోహిత్యం కూడా చేస్తుంటారు. ఆయనకు ఇద్దరు సంతానం. అమ్మాయి నాగ పావని ఎమ్మెస్సీ చేస్తోంది. కుమారుడు వెంకటశరత్‌కుమార్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇంటర్ చదువుతున్నాడు. 2022 సెప్టెంబర్‌లో కుమారుడు శరత్‌కు మార్ ప్యాసింజర్ రైల్లో నూజివీడు కళాశాలకు బయలుదేరాడు. రాత్రి కావడంతో కాలేజీలోకి రానివ్వరని విజయవాడ కృష్ణలంక జంక్షన్ వద్ద దిగాడు. విజయవాడలో ఉన్న పెదనాన్న గోపాలకృష్ణ ఇంటి చిరునామా అడిగేందుకు రైలు దిగిన తర్వాత ఫోన్ చేసి మాట్లాడాడు. అంతే ఆ తర్వాత మళ్లీ ఫోన్ రాలేదు. ఎన్నిసార్లు ఫోన్లు చేసినా స్విచ్ఛాఫ్ అనే వస్తోంది. దాంతో విజయవాడలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు తీసుకోలేదు. ఒంగోలులో ఫిర్యాదు చేయాలని సూచించడంతో ఇక్కడకు వచ్చి ఎస్పీ కార్యాలయంలో సెప్టెంబర్ 20న ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కుమారుడి ఆచూకీ కోసం గోవిందరావు, పద్మావతి దంపతులు పోలీసు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయినా శరత్ ఆచూకీ లభించకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకుండా పోయింది. గోవిందరావు ఉంటోంది.. అద్దె ఇల్లు కావడంతో మృతదేహాన్ని బ్రాహ్మణ ఆరామక్షేత్రంలో ఉంచారు. బిడ్డ ఇంకా వస్తాడేమోనన్న ఆశతో కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు.

ఔరంగబాద్ సర్పంచ్ కళావతి మృతి



వరికుంట్ల కళావతి(ఫైల్)



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ

కంభం: మండలంలోని ఔరంగబాద్ గ్రామ సర్పంచ్ వరికుంట్ల కళావతి(58) శుక్రవారం మృతి చెందారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శుక్రవారం కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఔరంగబాద్ సర్పంచ్‌గా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. స్వగ్రామంలోనే శనివారం మధ్యాహ్నం ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి హాజరై కళావతి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, నాయకులు రసూల్, వరికుంట్ల పెద్దకోటేశ్వరరావు, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, హుస్సేన్‌బాషా, సబ్బసాని సాంబశివారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు నివాళులర్పించారు.

వైఎస్ జగన్ కటౌట్ల తొలగింపు అమానుషం



తాడేపల్లిలో కటౌట్‌ను తొలగించి తీసుకెళ్తున్న మున్సిపల్ సిబ్బంది

కంభం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ తాడేపల్లిలో ఏర్పాటు చేసిన కటౌట్‌ను తొలగించడం అమానుషమైన చర్య అని కంభం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి పేర్కొన్నారు. అభిమానంతో తాను ఏర్పాటు చేసిన కటౌట్లను తాడేపల్లి మున్సిపల్ అధికారులు అనుమతి లేదంటూ తొలగించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో కూటమి పాలనపై ప్రజల్లో ఇప్పటికే వ్యతిరేకత మొదలైందన్నారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ పోరాటం మొదలుపెట్టిన నేపథ్యంలో వైఎస్ జగన్‌కు లభిస్తున్న ప్రజాదరణను ఓర్వలేక ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

పోలీసుల ఆరోగ్యానికి ప్రాధాన్యత

- ఎస్పీ ఏఆర్ దామోదర్
- జిల్లా పోలీసు కార్యాలయంలో ఆస్పత్రి భవనానికి భూమి పూజ



ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లాలో పోలీసు సిబ్బంది ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం సహకారంతో నిర్మిస్తున్న ఆసుపత్రి భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిత్యం ఒత్తిడికి గురయ్యే పోలీసులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సదుపాయాలతో ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులను సక్రమంగా, మరింత చురుగ్గా నిర్వహించగలుగుతారని చెప్పారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు రోజూ నడక, ఇతర వ్యాయమాలు చేయాలని సూచించారు. వైద్యశాల నిర్మాణానికి ముందుకు వచ్చిన కిమ్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు, సీఓఓ కె.అంకిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరిరెడ్డి, పోలీసు యూనిట్ వైద్యురాలు భానుమతి, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, సీతారామిరెడ్డి, హౌసింగ్ బోర్డు ఈఈ పార్థసారథి, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

జీఎస్‌డీపీ వృద్ధి రేటే లక్ష్యంగా కృషి చేయాలి



వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


ఒంగోలు అర్బన్: జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగంగా 15 శాతం జీఎస్‌డీపీ వృద్ధిరేటు లక్ష్యంతో వ్యవసాయం, అనుబంధ శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. గ్రీవెన్స్ హాలులో శుక్రవారం వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడు నెలల స్థిర లక్ష్యాలను సాధించేందుకు శాఖల ఆధ్వర్యంలో మండలాలు, డివిజనల్ వారీగా నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో అగ్రి డీప్ టెక్నాలజీ వినియోగంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు మేలు జరిగేలా తగిన సలహాలు, సూచనలు స్వీకరించి కౌలు రైతు చట్టం అమలు చేయాలన్నారు. డ్రోన్ టెక్నాలజీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు పంట బీమా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పశు సంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్షిస్తూ జిల్లాలో చేపట్టిన 21వ పశు గణన కార్యక్రమాన్ని 2025 జనవరి నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. మంజూరైన మినీ గోకులం షెడ్లను డ్వామా శాఖతో సమన్వయం చేసుకుని సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 1200 ఎకరాల్లో పశుగ్రాసం పెంచేలా లక్ష్యం కాగా 748.26 ఎకరాల్లో ఇప్పటి వరకు పశుగ్రాసం పెంచినట్లు తెలిపారు. మత్స్యశాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై మాట్లాడుతూ నిర్దేశించిన వృద్ధి రేటు సాధించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్టు కింద మత్స్యకారులందరినీ రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యానవన శాఖ అధికారులు ఉద్యాన పంటల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సూక్ష్మ సేద్యాన్ని మరింత ప్రోత్సహించాలన్నారు. దీనిలో వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, హార్టీకల్చర్ అధికారి గోపిచంద్, ఏపీ ఎంఐపీ పీడీ రమణ, సహకార శాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేపరు లీకవకుండా చూడాల్సింది ప్రభుత్వమే..

- యూటీఎఫ్ నేతల డిమాండ్

ఒంగోలు సిటీ: పరీక్ష ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా చూసుకోవడం పూర్తిగా ప్రభుత్వానిదేనని యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం భవిష్యత్‌లో పరీక్ష పేపర్లను పాఠశాలకు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం కళ్లు తెరవాలని, అలాగే ప్రభుత్వ అధికారులు కక్ష పూరిత ధోరణి మానుకోవాలని జిల్లా శాఖ తరపున డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలో పనిచేస్తున్న సిద్ధయ్య శెట్టి ప్రశ్నపత్రాలను పాఠశాలకు తీసుకువెళ్తూ మధ్యాహ్నం రంగంపేట వద్ద ప్రమాదానికి గురై మృతి చెందడం బాధాకరమన్నారు. సిద్ధయ్యశెట్టి తలుపులపల్లి జెడ్పీ హైస్కూల్లో బయలాజికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. యూటీఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ తరఫున ఆయన మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అదుపుతప్పిన ప్రైవేట్ స్కూల్ బస్సు



రోడ్డు మార్జిన్‌లో నిలిచిన బస్సు

సింగరాయకొండ: ప్రైవేట్ పాఠశాల బస్సు అదుపు తప్పి రోడ్డు మార్జిన్లోకి దూసుకెళ్లిన సంఘటన శుక్రవారం సింగరాకొండ–పాకల రోడ్డులో చోటుచేసుకుంది. ఎంఇఓ కత్తి శ్రీనివాసరావు కథనం ప్రకారం.. భాష్యం ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు పాకల వెళ్లి 12 మంది విద్యార్థులను తీసుకుని సింగరాయకొండ వస్తూ అదుపుతప్పింది. విద్యార్థులు సురక్షితంగా ఉండటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ విషయమై స్కూల్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావుకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పుల్లలచెరువు: మండలంలోని రెండు గ్రామాల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టి వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. నాటు సారా తయారీకి సిద్ధం చేసి ఉంచిన బెల్లం ఊటను నరజాముల తండా పరిధిలో 800 లీటర్లు, పెద్ద పీఆర్సీ తండా పరిధిలో 200 లీటర్లు గుర్తించి ధ్వంసం చేసినట్లు సీఐ వివరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.